క్లుప్తంగా

కేజీహెచ్‌కు కుర్చీల వితరణ



డాక్టర్ రాజును సత్కరిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్‌కు సాగర్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ (బయ్యవరం) సంస్థ సీఎస్‌ఆర్ బాధ్యతగా 23 కుర్చీలు అందజేసింది. అప్రైజర్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఈవీఆర్ రాజు సహకారంతో ఈ వితరణ జరిగింది. ఈ సందర్భంగా శనివారం కేజీహెచ్‌కు విచ్చేసిన డాక్టర్ ఈవీఆర్ రాజును సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ సన్మానించారు. కేజీహెచ్‌కు డాక్టర్ రాజు ఎంతో సహకరిస్తున్నారని డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి కలెక్టర్ మల్లికార్జున, సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని డాక్టర్ రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, మేనేజర్ కె.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం తన కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలు వినతులు అందాయి. హుద్‌హుద్ బాధితులకు ఇళ్ల పట్టాలు అందజేయాలని, కార్యకర్తల కోసం టిడ్కో ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందించి జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. కార్యకర్తలను ట్రస్టీలుగా నియమించాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ప్రెసిడెంట్లు, ఇన్‌చార్జిలు, స్టేట్, జిల్లా నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న లీడర్ సొసైటీ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా లీడర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పెదవాల్తేర్ దశాయి వీధిలో గల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిరాశ్రయుల ఆశ్రమంలో పలువురు వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడర్ సొసైటీ అధ్యక్షుడు జంగం జోషి, మైనార్టీ సభ్యుడు ఎస్‌వీపీడీ ప్రభాకర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, గ్రామీణ వైద్యుడు జయరాం, సొసైటీ సభ్యులు బెహరా, రాధిక, నిహారిక, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశరావుకు వైవీ అభినందన



ప్రకాశరావును అభినందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

దాబాగార్డెన్స్ : ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ములపర్తి ప్రకాశరావును వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఎంపికైన ప్రకాశరావు గురువు పొంద్రంగి రుక్మాకరరావును కూడా అభినందించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, ఉత్తరాంధ్ర అక్కినేని ఫ్యాన్స్ అధ్యక్షుడు బమ్మిడి రాము, బొండాడ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ లక్ష్యం.. ఆరోగ్యాంధ్రప్రదేశ్

దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే తీసుకుందని.. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమం ద్వారా దాన్ని సాధ్యం చేశారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రాథమిక దశలో ఆరోగ్యం మెరుగుపడని వారిని స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలిస్తామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆరోగ్యశ్రీలో లేని వైద్యం కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పేదల పట్ల సీఎం జగన్‌కున్న అపారమైన ప్రేమాభిమానాలకు ఇదే నిదర్శనమన్నారు.

- విద్య, వైద్యానికి పెద్దపీట
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 800 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఐసీడీఎస్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ పూర్ణిమ

తాటిచెట్లపాలెం : ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 41, 42 వార్డుల పరిధిలో గల రైల్వే న్యూకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. దార్శనికత కలిగిన నాయకుడు జగన్‌మోహనరెడ్డి అన్నారు. అభివృద్ధి అంటే ప్రజల ఆరోగ్యం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడడమే అన్నారు. ఈ శిబిరాలలో ప్రజల వద్దకే స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి షుగర్, బీపీ, థైరాయిడ్, కంటి పరీక్షలు, ఊపిరితిత్తుల పరీక్ష వంటి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. సమస్యలున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలిస్తు, వ్యాధిని గుర్తించిన దగ్గర నుండి నయం అయ్యే వరకు ప్రతి పైసా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. గత 20 రోజులుగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఐదు సచివాలయాల్లో ఉన్న వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేశారన్నారు. అనంతరం ఆరోగ్య సురక్ష శిబిరాలకు రావల్సిందిగా వారికి టోకెన్లు జారీ చేశారన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం ఎలా ఉందన్నది తెలుసుకుని వారికి తగిన సాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వాసుపల్లి తెలిపారు. రాష్ట్రంలో ప్రజల వైద్యానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఆ బాధ్యత సీఎం జగనన్నే తీసుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో లేని వైద్యాన్ని కూడా పొందాలంటే తమ దృష్టికి తీసుకువస్తే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉచితంగా అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యానికి బాటలు వేసుకోవాలని వాసుపల్లి కోరారు. అనంతరం మలేరియా అవగాహన శిబిరాన్ని, మాతా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార విలువలను తెలియజేసే ఐసీడీఎస్ స్టాళ్లను సందర్శించి అభినందించారు. ఈ శిబిరంలో సుమారు 800 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ కోడిగుడ్ల పూర్ణిమ, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా మలేరియా విభాగం అధికారి ఎం. తులసి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, పార్టీ నాయకులు ఎస్.ప్రసాదరావు, రమణారెడ్డి, వద్దాది దిలీప్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కేస్ షీట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ కూడలిలో మాక్‌డ్రిల్



సంఘ విద్రోహ శక్తుల్ని ఎలా ఎదుర్కోవాలో సిబ్బందికి వివరిస్తున్న ఆక్టోపస్ ఎస్పీ



జాగిలాలతో సిద్ధంగా ఉన్న ఆక్టోపస్ బృందం

దాబాగార్డెన్స్ : విశాఖ మహానగరంలో అర్ధరాత్రి వేళల్లో ఏదో జరుగుతోంది. అర్ధరాత్రి 1 గంట తర్వాత జగదాంబ జంక్షన్‌ను పెద్ద ఎత్తున పోలీసులు చుట్టుముడుతున్నారు. పహారా కాస్తున్న పోలీసుల వద్దకు ఉన్నతాధికారులు గంట గంటకు వచ్చి వివరాలు అడుగుతున్నారు. ఈ తతంగాన్ని నగర పౌరులు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. ఏ ముప్పు ముంచుకొస్తుందో.. ఉగ్రవాదులు నగరంపై పంజా విసరనున్నారా? అనే భయం గుప్పిట్లో నగర పౌరులు గడిపారు. ఇదంతా మాక్‌డ్రిల్ అని తర్వాత తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

ఇదంతా మాక్‌డ్రిల్లే..

నగరంలో అనుకోని విపత్తులు ఎదురై ఉగ్రవాద లేదా ఇతర సంఘ విద్రోహ శక్తులు దాడులు జరిపినపుడు వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టే విధంగా 'మాక్ డ్రిల్'ను స్థానిక పోలీసులు, ఆక్టోపస్ ఇతర అన్ని శాఖలతో కలిసి నిర్వహించారు. గత రెండు రోజులుగా అర్ధరాత్రి నుండి తెల్లవారు జాము వరకు ఆక్టోపస్, స్థానిక పోలీసులు, ఏఆర్ సీపీఎల్ పార్టీ, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక, విద్యుత్, నీటి సరఫరా సిబ్బంది ఈ 'మాక్ డ్రిల్'లో పాల్గొన్నారు. జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో గల దసపల్లా హోటల్ నందు ఉగ్రవాద దాడులపై మాక్ డ్రిల్ నిర్వహించారు. సుమారు 60 మంది అధికారులు, సిబ్బందితో రెండు రోజులు నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ ఎస్పీ బి.రవిచంద్ర, డీఎస్పీ వి.గణేష్‌బాబు, సిటీ సెక్యూరిటీ వింగ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎమ్మార్వో ఆనందరావు, దసపల్లా హోటల్ ఎండీ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీ వెంకటకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించిన నేతలు



అమ్మవారి వీధిలో అవగాహన కల్పిస్తున్న రంథి గోపి తదితరులు

అల్లిపురం : జగనన్న ఆరోగ్య సురక్షపై 33వ వార్డులో అవగాహన కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. దీంట్లో భాగంగా గురువారం వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. కుమ్మరవీధి సచివాలయం పరిధిలోని కొల్లివారివీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, భీశెట్టి రాజు, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ వర్కర్, సూపర్‌వైజర్, వైద్య విద్యార్థులు పాల్గొని ప్రజలను పరీక్షించారు.

అందుబాటులోకి వచ్చిన రెండో లిఫ్ట్

జగదాంబ : జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో పనిచేయని రెండవ లిఫ్ట్‌ను కూడా అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. సూర్యాబాగ్ జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో నాలుగు అంతస్తులు ఉన్నాయి. వీటిలో జోనల్ కార్యనిర్వహణ అధికారి, టౌన్‌ప్లానింగ్, యూసీడీ, రెవెన్యూ, ఇంజినీరింగ్, ఫైర్ ఆఫీసర్, పబ్లిక్ హెల్త్‌తో పాటు అధికారుల సమావేశ మందిరం ఉంది. ఇక్కడున్న రెండు లిఫ్టుల్లో ఒక్కటి మాత్రమే గతంలో పని చేసేది. దీంతో కార్యాలయానికి వచ్చే వికలాంగులు, వృద్ధులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు రెండవ లిఫ్ట్‌కు కూడా మరమ్మతులు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతుల తర్వాత పని చేస్తున్న రెండు లిఫ్ట్‌లు

సందడిగా అంతరిక్ష వేడుకలు



ఇస్రో ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వేడుకలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. మూడో రోజైన శనివారం ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలో 1,450, వ్యాసరచనలో 985, పోస్టర్ ప్రజెంటేషన్‌లో 310, చిత్రలేఖనంలో 1,860 మంది కలిపి మొత్తం 4,605 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి శాస్త్రవేత్తలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు, షార్ ఆర్గనైజింగ్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న పర్యవేక్షించారు. అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఈ ముగింపు కార్యక్రమానికి డీఆర్‌డీవో నేవెల్స్ సిస్టమ్స్ మెటీరియల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ విజయనగరం వీసీ కె.వెంకట సుబ్బయ్య, ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

మహారాణిపేట : ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో వరుసగా జరుగుతున్న అనుమానాస్పద ఘటనలపై అవగాహన కలిగించేందుకు వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ సమావేశం ఏర్పాటు చేశారు. మత్స్యకారులు పోలీసులకు సహకరిస్తే పూర్తిస్థాయిలో దొంగతనాలు జరగకుండా అరికట్టే ఆస్కారం ఉందన్నారు. ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ మాట్లాడుతూ నేరాలు జరక్కుండా సుమారు రూ. 6 లక్షల వ్యయంతో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళా ఎస్‌ఐ అయినా పూర్తిస్థాయిలో గంజాయి ముఠాలను తరిమి కొడుతున్న సీఐ రేవతమ్మకు, పోలీస్ డిపార్టుమెంట్‌కు, క్రైమ్ ఎస్‌ఐ శ్రీనివాస్‌కు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంటు దానయ్య, పుక్కళ్ల ఈశ్వరరావు, అర్జల చిన్న, కోశాధికారి మైలపల్లి నరసింహులు, మైలపల్లి చిన్నయ్య, గణగళ్ల రాజేష్, గణగళ్ల పోతయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ రేవతమ్మ

దళిత ఉద్యమ నేత 'చెన్నా' కన్నుమూత

దాబాగార్డెన్స్ : దళిత ఉద్యమ నేత చెన్నా అప్పలరాజు (87) శనివారం కన్ను మూశారు. రెల్లివీధిలో నివాసం ఉంటున్న చెన్నా విద్యార్థి దశ నుంచే దళిత ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో లేబర్ ఆఫీసర్‌గా పని చేశారు. దేశ రాజధాని, ఉభయ రాష్ట్ర స్థాయిల్లో ఉద్యమాలు చేసి, రెల్లికుల అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పలరాజు అంత్యక్రియలు కాన్వెంట్ జంక్షన్ హిందూ స్మశాన వాటికలో నిర్వహించారు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. డాక్టర్ దల్లై ఆడమ్స్, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూదనరావు, చెన్నా తిరుమలరావు, కల్యాణముని, బి. రవిశంకర్, ఉత్తమ ముని, మాజీ కార్పొరేటర్ సిమ్మా భాస్కరరావు, భూలక్ష్మి తదితరులు పాల్గొని చెన్నాకు నివాళులర్పించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

జగదాంబ : ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు అన్నారు. శనివారం పూర్ణామార్కెట్ వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐలు భాస్కరరావు, జోగారాజు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారికి అవగాహన కల్పించి రహదారిని క్లియర్ చేశారు. తోపుడు బండ్ల వ్యాపారులు మార్కింగ్ దాటకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ ఆరోగ్య బీమా అందజేత



బీమా నగదు అందజేస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు డ్వాక్రా బజార్ సచివాలయ పరిధి, కనకలవీధికి చెందిన గంధం జగదీష్ లివర్ సమస్యతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దహన సంస్కారాల కోసం వైఎస్సార్ ఆరోగ్య బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు జగదీష్ భార్య సూర్యలక్ష్మికి కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, జేసీసీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు సూర్యలక్ష్మి అకౌంట్‌లో జమ చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ రవితేజ, వలంటీర్ శ్రీను, కన్వీనర్ బాబూరావు, రాంబాబు, ధనలక్ష్మి, శేఖర్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ ఏర్పాటు

- వీపీఏ చైర్మన్ అంగముత్తు
- ఘనంగా విశాఖ పోర్ట్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ(వీపీఏ) 90వ ఆవిర్భావ వేడుకలు శనివారం పోర్ట్ వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల మధ్య పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్ట్ అభివృద్ధికి పలు సూచనలిచ్చారు. త్వరలోనే పోర్ట్ వ్యాపార భాగస్వాముల సలహాలతో మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని సందర్శనకు నగర పౌరులకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో 90 ఏళ్ల కాలంలో పోర్ట్‌లో వినియోగించిన వస్తువులు, 90 వసంతాల పోర్ట్ ప్రయాణాన్ని వివరించే ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి గల బాలల్లో పరివర్తనకు కృషి చేయాలి

విశాఖలీగల్ : బాలల నేరాలు, నిర్బంధం, ప్రత్యామ్నాయ చర్యలపై ఆలోచించాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కోరారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో 'బాలలు, నేరాలు, ప్రత్యామ్నాయ శిక్షలు, నిర్బంధం'వంటి అంశాలపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలకు అలవాటు పడిన బాలలకు సంబంధించి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, వారికి ప్రత్యామ్నాయ శిక్షలు, పరివర్తన వంటి అంశాలను చర్చించారు. నేరాలకు పాల్పడిన కౌమార దశ బాలలకు పరివర్తన వచ్చే విధంగా శిక్షలు అమలు చేయాలని వివరించారు. ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తమ ప్రసంగంలో ఇటీవల కాలంలో సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత చిన్నారుల్లో సైతం నేర ప్రవృత్తి పెరిగిందన్నారు. రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వెంకటరమణ, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఆనందిని, రెండవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.వి.ఎల్. హిమబిందు, న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ, ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల శతాబ్ది వేడుకలు

మద్దిలపాలెం: ఘంటసాల శతాబ్ది వేడుకలు మద్దిలపాలెం కళాభారతిలో శనివారం ఘనంగా జరిగాయి. చెన్నైకి చెందిన కళా ప్రదర్శిని సంస్థ వ్యవస్థాపకులు ఘంటసాల కోడళ్లు పార్వతీరవి, కృష్ణకుమారిరత్నల ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. ఘంటసాల ఆలపించిన మధురగేయాలకు పార్వతీ రవి ఘంటశాల నృత్యాలు అలరించాయి. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘంటసాల స్మారక పురస్కారాలను నాట్య గురువులు ఏబీ బాలకొండలరావుకు, వేదాంతం రామలింగ శాస్త్రిలకు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ సంగీత సరస్వతి ముద్దు బిడ్డగా ఘంటసాల వేంకటేశ్వరరావు ఖ్యాతికెక్కారన్నారు. రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.రఘురామారావు, డాక్టర్. సయ్యద్ రెహ్మతుల్లా, జాన్ మాస్టార్, ఘంటసాల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, ఎంవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బాల కొండలరావును సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో పురందేశ్వరి, శివమణి

ఖైదీ మృతిపై 12న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: నెల్లూరు సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న రాయపాటి నాగరాజు మృతిపై ఈనెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం రాయపాటి నాగరాజు అనే వ్యక్తిని చికిత్స కోసం ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన విశాఖలో కేజీహెచ్‌కు తరలించారు. అదే నెల 21న సాయంత్రం 6.45 చికిత్స పొందుతూ చనిపోయారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్ణయించారు. విచారణ అధికారిగా ఆర్‌డీవోని నియమించారు. విశాఖ ఆర్‌డీవో కార్యాలయంలో 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నామని, రాయపాటి నాగరాజు మృతి గురించి తెలిసిన వారు విచారణకు హాజరై, లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్‌డీవో ఒక ప్రకటనలో తెలిపారు.

శారదా సుబ్రహ్మణ్యంకు డి.లిట్ పురస్కారం

దాబాగార్డెన్స్ : ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని డాక్టర్ గుమ్ములూరి శారదా సుబ్రహ్మణ్యం డి.లిట్ పురస్కారం అందుకున్నారని కళాభారతి ట్రస్టీ రాంబాబు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నెల 15న ఐటీఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా రాయపూర్‌లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, పద్మ విభూషణ్ డాక్టర్ ఆర్. చిదంబరం, విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ పీవీ రమణ, ఉపకులపతి డాక్టర్ సుమేరు సింగ్ సమక్షంలో ఆమెను డి.లిట్‌తో సత్కరించారన్నారు. కర్ణాటక సంగీతానికి ఆమె చేస్తున్న సేవలు, సంగీత జనకులం ద్వారా బాల, యువ గాయనీ గాయకులకు ఇస్తున్న శిక్షణను గుర్తించి ఈ పురస్కారం అందజేశారన్నారు.



డి.లిట్ పురస్కారం చూపుతున్న కళాభారతి ట్రస్టీ రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం తదితరులు

దుర్గమ్మ ఉత్సవాలకు శ్రీకారం

అల్లిపురం : మెయిన్‌రోడ్డు శ్రీ ధనశక్తి దుర్గాదేవి ఆలయ పీఠం 21వ వార్షికోత్సవానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ రాట కార్యక్రమం భక్త జనసందోహం మధ్య వైభవంగా నిర్వహించారు. ముత్తయిదువులు పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, మామిడి ఆకులు, వేప ఆకులతో రాటను అలంకరించారు. అనంతరం రవి భవానీ దంపతులు ముహూర్తపు రాటకు పూజలు చేశారు. ఈ సందర్భంగా రవి భవానీ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు పాల్గొనాలని కోరారు.

రాజధానికి ఆటంకాలు లేకుండా చూడాలి



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 108 అడుగుల గణేష్ మండపం వద్ద శనివారం జరిగిన భారీ అన్న సంతర్పణ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తొలి పూజితుడిని వేడుకుంటే సకల కార్యాలు సిద్ధిస్తాయన్నారు. విశాఖ పరిపాలన రాజధానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని గణనాథుడిని వేడుకున్నట్లు తెలిపి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.